సాక్షి
కర్నూలు
గురువారం ♦ 11 ♦ ఏప్రిల్ ♦ 2024



వైభవంగా గ్రామోత్సవం
మహానంది: శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను బుధవారం నంది వాహనంపై కొలువు ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



అలరించిన నృత్యప్రదర్శన
శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల సందర్భంగా బుధవారం తెనాలికి చెందిన కృతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



.. ప్రేమదే విజయం
ప్రేమను గెలిపించే పోరాటం బుధవారం ఆస్పరి మండలం కైరుప్పలలో కొనసాగింది. ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవిని ఒక్కటి చేసింది. IIలో▸

న్యూస్‌రీల్

రేపు ఇంటర్ ఫలితాల విడుదల!
కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలను రేపు(శుక్రవారం) విడుదల చేసే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గత నెల 1 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని 69 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవత్సరం 22,239 ద్వితీయ సంవత్సరం 25,173 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. గత నెల 18న ప్రారంభమైన మూల్యాంకనం అదేనెల 31వ తేదీతో ముగియాల్సి ఉంది. అయితే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు మూల్యాంకనానికి హాజరు కాకపోవడంతో నాలుగు రోజులు ఆలస్యంగా ఈనెల 4వ తేదీతో ఈ కార్యక్రమం ముగిసింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో గతేడాది కంటే ముందుగానే పరీక్షల ఫలితాలను విడుదల చేసేందుకు బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

వలంటీర్ల రాజీనామాలు ఆమోదం
కర్నూలు(అర్బన్): జిల్లాలోని 11 మండలాలకు సంబంధించి 264 మంది గ్రామ సచివాలయ వలంటీర్ల రాజీనామాలను ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంతా తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు సంబంధిత ఎంపీడీఓలకు రాజీనామా పత్రాలను అందించారన్నారు. వారికి సంబంధించి ఎలాంటి బకాయిలు లేకపోవడం, ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను ఎంపీడీఓలకు అప్పగించడంతో రాజీనామాలను ఎంపీడీఓలు ఆమోదించారన్నారు.

అధిక ఉష్ణోగ్రతలపై అప్రమత్తం
కర్నూలు(సెంట్రల్): అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి.. ప్రజలను వడదెబ్బ బారిన పడకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఏప్రిల్‌లోనే 46, 47 డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయని, మే నెలలో 50 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరముంటే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. ప్రజలకు మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. ఉపాధి పనులను ఉదయం 10 గంటల్లోపు ముగిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్‌రావు, డీపీఓ నాగరాజునాయుడు, అదనపు ఎస్పీ నాగరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డి పాల్గొన్నారు.

చెక్‌పోస్టులలో పటిష్ట నిఘా
శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన లింగాల గట్టు వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం ఎంట్రీ బుక్‌ను పరిశీలించారు. వాహనాలను తనిఖీ చేయడమే కాకుండా అనుమానాస్పద వ్యక్తుల లగేజీని తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చెక్‌పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆక్రమ మద్యం, నగదు, బంగారం, రవాణా కాకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.



గోరుకల్లు రిజర్వాయర్ విహంగ వీక్షణం

కడగళ్లు తీరగా.. ప్రగతి పారగా!


కర్నూలు.. జలవనరుల రాజధాని. 'సీమ'కు నీరందించే ఈ జిల్లాలో నీటి కష్టాలు దశాబ్దాల తరబడి ఉండేవి. దీన్ని గ్రహించిన మహానేత వైఎస్సార్ గోరుకల్లు రిజర్వాయర్ చేపట్టారు. జలయజ్ఞంలో ఇది లేకపోయినా కేవలం కర్నూలు నీటి అవసరాలు, తద్వారా ఈ ప్రాంత అభివృద్ధిని గ్రహించి 'గోరుకల్లు'కు బీజం వేశారు. ఆయన హయాంలో 65శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆయన తనయుడు జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి ప్రాజెక్టు ఎత్తు, నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఈ ప్రాజెక్టు ఆధారంగా రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగుని పెట్టుబడులతో పారిశ్రామిక అభివృద్ధికి బీజం వేశారు. దీంతో జిల్లా అభివృద్ధిలో గోరుకల్లు అత్యంత కీలకమైంది.

– కర్నూలు సిటీ

- గోరుకల్లుతో మారిన కర్నూలు, నంద్యాల అభివృద్ధి రేఖ
- మహానేత చేపట్టిన గోరుకల్లు...జననేత చొరవతో మరింత అభివృద్ధి
- జలయజ్ఞంలో లేకపోయినా ఎమ్మెల్యే కాటసాని చొరవతో ప్రాజెక్టు చేపట్టిన వైఎస్సార్
- అప్పట్లో తొమ్మిదేళ్లు, ఆపై ఐదేళ్లు సీఎంగా ఉన్నా.. గోరుకల్లును విస్మరించిన చంద్రబాబు
- వైఎస్సార్ హయాంలోనే రూ.482 కోట్లు ఖర్చు.. 65శాతం పనులు పూర్తి
- ఇప్పుడు గోరుకల్లు అభివృద్ధి కోసం రూ.29 కోట్లు మంజూరు
- మరో రూ.99.22 కోట్లతో ప్రాజెక్టు ఎత్తు పెంపుకోసం ప్రతిపాదనలు
- ప్రాజెక్టు ఎత్తు పెరిగితే 12.44 టీఎంసీల నీరు నిల్వ
- ప్రాజెక్టు రాకతో తొలగిన సాగు, తాగునీటి కష్టాలు
- గోరుకల్లు ఆధారంగా గ్రీన్‌కో స్థాపన...పారిశ్రామిక అభివృద్ధికి బీజం

ఒక నాయకుడికి ముందు, ఆ తర్వాత అని పాలన సాగించే నేతలు చరిత్రలో కొందరే ఉంటారు. అలాంటి నాయకుడే వైఎస్సార్. దుర్భిక్ష రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ఏకంగా 72 ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏకకాలంలో చేపట్టారు. 'ఇన్ని ప్రాజెక్టులు ఒకేసారి ఎందుకు రాజశేఖరా? ప్రాధాన్యత క్రమంలో కొన్ని చేపట్టి పూర్తి చేద్దాం! అన్నీ ఒకేసారి ప్రారంభిస్తే ఏదీ పూర్తికాదు' అని అప్పటి ఆర్థికశాఖ మంత్రి రోశయ్య సూచిస్తే... దానికి బదులుగా 'అన్నా! అన్నీ ఒకేసారి ప్రారంభిద్దాం! పూర్తయిన కాడికి పూర్తవుతాయి. మళ్లీ మనం అధికారంలోకి వస్తే అన్నీ పూర్తి చేస్తాం! లేకపోతే అన్ని ప్రాజెక్టులు మధ్యలో ఉంటాయి కాబట్టి వచ్చిన ప్రభుత్వం తప్పక పూర్తి చేయాల్సి వస్తుంది. ఈ అంశాన్ని రాజకీయంగా కాకుండా అభివృద్ధి కోణంలో చూద్దాం! మనం కూడా చేయకపోతే భవిష్యత్‌లో ఎవ్వరూ చేయలేరు' అని ఆలోచించిన మహానేత వైఎస్సార్. అందుకే హంద్రీ–నీవా, గాలేరు–నగరి, హెచ్చెల్సీ, ఎల్ఎల్‌సీ ఆధునికీకరణతో పాటు ఎన్నో ప్రాజెక్టులు సీమలో చేపట్టారు. ఇదే క్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వైఎస్‌తో మాట్లాడి గోరుకల్లు ప్రాధాన్యతను వివరించారు. ఏమాత్రం ఆలోచించకుండా జలయజ్ఞంలో లేకపోయినా గోరుకల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు వైఎస్సార్!

పుష్కరం తర్వాత మోక్షం!
గోరుకల్లుకు 1993 జనవరి 21న అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు శంకుస్థాపన చేశారు. అప్పుడు, ఆపై తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు హయాంలో గోరుకల్లు ప్రస్తావన లేదు. 2004లో వైఎస్ సీఎం అయిన తర్వాత 2005లో గోరుకల్లును చేపట్టారు. గాలేరు–నగరి సుజల స్రవంతిలో భాగంగా ఓసీ–50 ప్యాకేజీగా రూ.616కోట్లతో ప్రాజెక్టు చేపట్టారు. వైఎస్ హయాంలో రూ.482.22కోట్లు ఖర్చు చేసి 65శాతంపైగా పనులు చేశారు. ఆ తర్వాత పాలకులు పట్టించుకోలేదు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక పనులు పూర్తికాకుండా 12.4 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో కేవలం 3.36 టీఎంసీలు నిల్వ చేసి గేట్లు కూడా అమర్చకుండా హడావుడిగా ప్రారంభం చేసినట్లు కొబ్బరికాయ కొట్టారు. ఒక్క ఎకరాకు సాగునీరు అందించలేకపోయారు.



ఎస్సార్బీసీ ప్రధాన కాలువ

గోరుకల్లుతో పారిశ్రామిక బీజాలు..
ఎస్ఆర్‌బీసీ కింద 1.92వేల ఎకరాలకు సాగునీరు, 650 గ్రామాలకు తాగునీరు అందాలి. ఇవన్నీ గోరుకల్లు నుంచే వెళ్లాలి. దీంతోపాటు డోన్ నియోజకవర్గానికి తాగునీటి సమస్యను తీర్చేందుకు రూ.297కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని 'గ్రీన్‌కో' చేపట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద రెన్యువబుల్ విద్యుత్ కేంద్రానికి 2.35 టీఎంసీలు నీటిని పంపిస్తున్నారు. రూ.15వేలకోట్ల చేపట్టిన ఈ ప్రాజెక్టు రెండో దశలో మరో రూ.8వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. రాష్ట్రచరిత్రలో ఇదే అత్యంత భారీ పెట్టుబడి పరిశ్రమ. గోరుకల్లు రాకతోనే ఇది సాధ్యమైంది. జయజ్యోతి సిమెంట్‌కు నీటిని అందిస్తున్నారు.

నాడు మహానేత...
నేడు జననేత చొరవతో
గోరుకల్లుకు జలకళ

గోరుకల్లు సామర్థ్యం 12.4 టీఎంసీలుగా డీపీఆర్ రూపొందించారు. 265.6 మీటర్ల ఎత్తుతో నిర్మించాలి. ఇప్పటి వరకూ 262 మీటర్లు ఎత్తు నిర్మించారు. చంద్రబాబు తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా 11.2 టీఎంసీలు గోరుకల్లులో నిల్వ ఉంచారు. అంటే చంద్రబాబు కంటే 6.9 టీఎంసీలు అధికంగా నిల్వ చేశారు. అంతటితో ఆగలేదు. ఈ ప్రాజెక్టును ఎత్తు మరో 4.5 మీటర్లు పెంచేందుకు రూ.99.22కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆర్థికశాఖ ఆమోదం పొందాల్సి ఉంది. ఇది పూర్తయితే ప్రాజెక్టులో 12.44 టీఎంసీలు నిల్వ చేయొచ్చు. దీంతో పాటు ప్రాజెక్టుకు మరో రెండు గేట్లు అమర్చేందుకు రూ.28కోట్లు మంజూరు చేశారు. పనులు కూడా చివరిదశలో ఉన్నాయి. 'సీమ'జిల్లాలకు నీటిని అందించడంలో గోరుకల్లు అత్యంత కీలకమైంది. ఇక్కడి నుంచే నీళ్లు వెళ్లాలి. ఈ ప్రాజెక్టు కట్టకు ఉన్న రాతి పరుపు చంద్రబాబు హయాంలో దెబ్బతింటే దీన్ని కూడా పట్టించుకోలేదు. దీన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి.. సీఎం దృష్టికి తీసుకెళితే అత్యవసరంగా రూ.92లక్షల మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. దీంతోపాటు ఎస్ఆర్‌బీసీ కాలువను బనకచర్లక్రాస్ రెగ్యులేటర్ నుంచి 30వేల నుంచి 40వేల క్యూసెక్యులకు సామర్థ్యాన్ని పెంచారు. దీంతో గోరుకల్లుకు నీటిని తక్కువ కాలంలో తీసుకొచ్చే అవకాశం ఉంది. కాలువలో నుంచి రిజర్వాయర్‌లోకి నీటిని చేర్చే ఇన్‌ఫాల్ రెగ్యులేటర్‌కు 5 గేట్లు ఉంటే కోట్ల రూపాయలు ఖర్చు చేసి మరో రెండు గేట్లు అమరుస్తున్నారు. మొత్తంగా రూ.616 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టును రూ.834కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచి పూర్తి చేశారు.

నేడే ఈద్–ఉల్–ఫితర్

- నెలవంక దర్శనంతో ముగిసిన ఉపవాసాలు
- గురువారం ఈద్ నమాజ్ చేయనున్న ముస్లింలు
- నమాజ్ కోసం ఈద్గాల్లో, మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు



హొళగుంద ఈద్గాను పరిశీలిస్తున్న పోలీసులు

కర్నూలు(న్యూటౌన్): పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. శవ్వాల్ నెల ప్రారంభ సూచికగా బుధవారం సాయంత్రం నెలవంక దర్శనంతో ' చాంద్ దిఖ్ గయా.. కల్ హి ఈద్ హై. ఈద్ ముబారక్ అంటూ కొందరు ముందస్తు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ముస్లింలు నెల రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు 14గంటలకు పైగా చుక్క మంచి నీరు తాగకుండా నిష్ఠతో రోజాలు పాటించారు. ఐదు పూటలా నమాజులు చేశారు. ఎవరి శక్తి కొద్ది వారు దాన ధర్మాలు చేశారు. ఉన్న ధన సంపదలో 2.50 శాతం పేదలకు జకాత్‌గా అందజేశారు. అనేక పుణ్య కార్యాలు చేశారు. ఈ నేపథ్యంలో నెలవంక కనిపించడంతో వారి ఇళ్లలో ఆనంద ఛాయలు నెలకొన్నాయి.

ఈద్ నమాజ్‌కు సిద్ధం
ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా నిర్వహించే నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈద్గాలతో పాటు పలు మసీదుల్లో నిర్వహకులు అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించారు. పండుగ రోజు అల్లాహ్‌కు కృతజ్ఞతా భావం వ్యక్తం చేసుకునేందుకు ముస్లింలు ఈద్గాలకు వెళ్లి రెండు రకాత్‌ల ఈదుల్ ఫితర్ వాజిబ్ నమాజ్ చేస్తారు. నెల రోజుల తమ ఇబాదత్‌లు ఫలించాలని, సర్వమానవాళి సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అల్లాహ్‌తో దువా చేస్తారు. కర్నూలు నగరంలో ఈద్గాలతో పాటు ప్రకటించిన మసీదుల్లో కూడా ఈద్ ఉల్ ఫితర్‌కి నమాజ్ నిర్వహిస్తారు. ఈద్ నమాజ్‌కు ముందే తప్పనిసరిగా ప్రతి కుటుంబ సభ్యుల (అప్పుడే పుట్టిన పసికందు అయినా సరే) పేరిట ఫిత్రా చెల్లించాల్సిన బాధ్యత అందరూ ముస్లింలపై ఉందని మౌల్వీలు చెబుతున్నారు. ఫిత్రా చెల్లించకపోతే ఉపవాసాలను అల్లాహ్ అంగీకరించరని పేర్కొంటున్నారు.

ఉగాది మహోత్సవాలకు పూర్ణాహుతి

- చండీశ్వరుడికి మల్లికాగుండంలో అవభృదం, త్రిశూలస్నానం
- నిజాలంకరణలో శ్రీభ్రమరాంబాదేవి దర్శనం



స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో ఐదురోజులుగా కొనసాగుతున్న ఉగాది మహోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు మహోత్సవాలకు శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయంలోని మల్లికాగుండం వద్ద అవభృదం, త్రిశూలస్నానం చేపట్టారు. శ్రీభ్రమరాంబాదేవి నిజాలంకరణలో దర్శనమివ్వగా, స్వామిఅమ్మవార్లు అశ్వవాహనంపై విహరించారు. ముందుగా అమ్మవారి యాగశాలలో చండీహోమం జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగకార్యక్రమాన్ని పూర్తి చేశారు. పూర్ణాహుతి అనంతరం వసంతోత్సవం జరిపించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు వసంతాన్ని పసుపు, సున్నం, సుగంధద్రవ్యాలు కలిపిన మంత్రపూరిత జలాన్ని సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. చండీశ్వరస్వామికి ఆలయంలోని మల్లికాగుండం వద్ద అవభృదం, త్రిశూల కార్యక్రమాలు జరిపించారు. అవభృదంలో రుద్రధ్యాయ మంత్రాలతో చండీశ్వరస్వామికి శుద్ధజలం, పంచామృతాలు, భస్మోధకం, కుంకుమోదకం, హరిద్రోదకం, సుగంధోదకం, బిల్వోదకం, పుష్పోదకం, నారికేళం మొదలైన వాటితో స్నపన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి శుద్ధజలంతో వెండి పళ్లెంతో సహస్రధారాభిషేకం జరిపించి అభిషేక తీర్థాన్ని అర్చకస్వాములు భక్తులపై ప్రోక్షించారు. అనంతరం చండీశ్వరస్వామికి మల్లికాగుండం వద్ద త్రిశూల స్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కరిణి జలాన్ని తలపై ప్రోక్షించడంతో పాపాలన్ని హరించి శ్రేయస్సు కలుగుతుందని భక్తుల విశ్వాసం. చివరిగా చండీశ్వర స్వామికి తిరిగి పూజాదికాలు జరిపించి ఆలయంలోకి తోడ్కొని వచ్చారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చండీశ్వరునికి పూజలు చేస్తున్న ఈఓ దంపతులు

భ్రామరీ సమేత మల్లన్నకు అశ్వవాహనసేవ
ఉగాది మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహించారు. శ్రీభ్రమరాంబాదేవి నిజరూపంలో దర్శనమిచ్చారు. ఈ నెల 6వ తేది నుంచి ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఎటువంటి చిన్నపాటి సంఘటనలు కూడా చోటుచేసుకోకుండా ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో దేవస్థానం , వివిధ శాఖల అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.



చండీశ్వరస్వామికి త్రిశూల స్నానం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని 1,500 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నోడల్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు లైట్లు, ఫ్యాన్‌లు, ముఖ్యంగా రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రం ఎదుట షామియానాలు, కుర్చీల ఏర్పాటు, మంచినీటి కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. వెబ్‌కామ్స్ ఏర్పాటుకు పోలింగ్‌కేంద్రం లోపల, బయట ప్లగ్ పాయింట్లను గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా మరమ్మతులు జరుగుతుంటే వాటిని 25వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఈడబ్ల్యూఐడీసీ ఎస్ఈ లక్ష్మీనారాయణ, ఎమ్మిగనూరు మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన, సమావేశానికి హాజరైన నోడల్ అధికారులు

13లోపు దరఖాస్తు అందజేయాలి
ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ కోసం 13వ తేదీ లోపు ఫారం–12ను సంబంధిత ఆర్ఓకు లేదంటే తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలకు సంబంధించి విధుల్లో ఉండే 33 శాఖలకు చెందిన అధికారులు కూడా పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందని, వారు ఫారం–12డీని ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ఆర్ఓలు లేదా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఎక్కడా నేరుగా ఓటు వేసే హక్కు ఉండబోదన్నారు.

24 నుంచి ఎన్నికల అబ్జర్వర్ల పర్యటన
ఎన్నికల అబ్జర్వర్లు ఏప్రిల్ 24 నుంచి జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన తెలిపారు. వీరికి ప్రభుత్వ అతిథి గృహాల్లో బస ఏర్పాట్లు చేయాలన్నారు. కర్నూలు, ఆదోనిలో ప్ర భుత్వ అతిథి గృహాలకు ఏమైనా మరమ్మతులు ఉంటే చేసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో లెయిజన్ అధికారులతో ఆమె సమీక్షించారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక అబ్జర్వరు, కర్నూలు, కోడుమూరు, మంత్రాలయం , ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, నంద్యాల, శ్రీశైలం , పాణ్యం, డోన్ నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, ఉమ్మడి జిల్లాకు కలిపి ఒక పోలీసు అబ్జర్వర్ నియమిస్తారన్నారు. నంద్యాల, శ్రీశైలం, పాణ్యం, డోన్ నియోజకవర్గాలకు సంబంధించిన జనరల్ అబ్జర్వర్ నంద్యాల జిల్లాలోనే ఉంటారని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్‌తో కలసి ముగ్గురు జనరల్ అబ్జర్వర్లు కర్నూలు జిల్లాలో ఉంటారని పేర్కొన్నారు. వారికి అనుగుణంగా లెయిజన్ ఆఫీసర్లను కేటాయిస్తున్నట్లు చెప్పారు. అబ్జర్వర్లు వారికి కేటాయించిన నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తారని, వాటిలో మౌలిక సదుపాయాలను పరిశీలిస్తారన్నారు.

లక్ష్యాలను అధిగమించిన మార్కెటింగ్ శాఖ
- రూ.32.75 కోట్లకు పైగా ఫీజు వసూలు

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు వసూలులో లక్ష్యాలను అధిగమించింది. గత ఏడాది జిల్లాలో కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా వ్యాపారుల నుంచి 1 శాతం ఫీజు రూపంలో గణనీయమైన ఆదాయాన్ని పెంచుకోవడం విశేషం. జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉండగా.. మార్కెటింగ్ శాఖ రూ.30.85 కోట్లను లక్ష్యంగా ఇచ్చింది. అయితే రూ.32.75 కోట్లకుపైగా వసూలైంది. ఆదోని, కోడుమూరు మార్కెట్ కమిటీలు మినహా మిగిలిన అన్ని మార్కెట్ కమిటీలు లక్ష్యాలను అధిగమించాయి. 2023–24లో వర్షాభావం వల్ల పంట దిగుబడులు తగ్గినప్పటికీ దాదాపు అన్ని పంటలకు ధరలు మెరుగ్గా ఉండటంతో మార్కెట్ ఫీజు వసూలులో గణనీయమైన ప్రగతి సాధ్యమైందని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు. వసూలు చేసిన ఒక్క శాతం ఫీజు మార్కెట్ కమిటీల అభివృద్ధి, రైతుల సంక్షేమానికి వినియోగిస్తామని బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల
కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జనవరి నెలలో జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ పుచ్చా వెంకట సుందరానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 6,999 మంది పరీక్షలు రాయగా 3,806 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 8,525 మంది పరీక్షలు రాయగా 3,770 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

క్లుప్తంగా

ఉచిత న్యాయ సేవలపై అవగాహన

కర్నూలు (లీగల్): ఉచిత న్యాయ సేవలపై ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. బుధవారం పంచలింగాలలోని జిల్లా కారాగారాన్ని ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సిస్టమ్ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖైదీలకు సూచించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి, ఏదైనా సమస్య వస్తే జిల్లా న్యాయ సేవాధి కార సంస్థను ఆశ్రయించాలని చెప్పారు. వంట గదులు, జైలు గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ప్రజా ప్రయోజనాల సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, జిల్లా సూపరింటెండెంట్ ఘనే నాయక్, న్యాయవాదులు ఎం.ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పారా లీగల్ వాలంటీర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

అట్టల లారీ దగ్ధం



మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి అట్టల లారీ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం రాత్రి కోడుమూరు మండలం కొత్తూరు వద్ద చోటు చేసుకుంది. బళ్లారి నుంచి హైదరాబాద్‌కు అట్టల లోడ్‌తో వెళ్తుండగా లారీలో మంటలు చెలరేగడంతో డ్రైవర్ షేక్షావలి వెంటనే లారీని రోడ్డుపైనే ఆపివేసి క్షేమంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేసినా అప్పటికే లారీ పూర్తిగా కాలిపోయింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన జమాల్‌బాషా (ఫైల్)

బనగానపల్లె రూరల్: కోవెలకుంట్ల – బనగానపల్లె రహదారిలో ఇల్లూరు కొత్తపేట సమీపంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చాలగలమర్రికి చెందిన పి. జమాల్‌బాషా(28) స్థానికంగా బంగారం షాపులో గుమస్తాగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా పని నిమిత్తం బనగానపల్లెకు బైక్‌పై వచ్చిన జమాల్‌బాషా తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. కాగా మార్గమధ్యలో ఆర్ ఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో బనగానపల్లె తెలుగుపేట చెందిన తిరుపాల్ బైక్‌పై కోవెలకుంట్ల నుంచి బనగానపల్లెకు వస్తుండగా ప్రమాదశాత్తు ఎదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జమాల్‌బాషా అక్కడికక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లగా తిరుపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానికుల సహకారంతో వెంటనే చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు జమాల్‌బాషా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తీవ్రగాయాలైన తిరుపాల్‌ను మెరుగైన నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య మల్లిక, రెండేళ్ల వయసు ఉన్న కుమారుడు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

పిడకల సమరం..

ప్రేమదే విజయం



కారుమంచి నుంచి గుర్రంపై వస్తున్న పెద్దరెడ్డి వంశస్తుడు నరసింహారెడ్డి

ప్రేమను గెలిపించే పోరాటం బుధవారం ఆస్పరి మండలం కైరుప్పలలో కొనసాగింది. ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవిని ఒక్కటి చేసింది. ఈ సంప్రదాయ సంగ్రామంలో 30 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఆచారం ప్రకారం కారుమంచి నుంచి పెద్దరెడ్డి వంశస్తుడైన నరసింహారెడ్డి గుర్రంపై మందీ మార్బలంతో ఊరేగింపుగా కైరుప్పలకు వచ్చి వీరభద్ర స్వామి ఆలయంలోకి వెళ్లి పూజలు చేసి వెనుతిరిగారు. ఆతరువాత పిడకల సమరం మొదలైయింది. రెండు వర్గాలుగా విడిపోయిన గ్రామస్తులు పరస్పరం ఒకరిపై ఒకరు పిడికలతో దాడి చేసుకున్నారు. వందల సంఖ్యలో గాల్లోకి పిడకలు లేచి ప్రత్యర్థి వర్గంపై పడుతుంటే ఉత్సాహం రెట్టింపు అయ్యింది. పిడకల దుమ్ము అకాశాన్నంటింది. తమను తాము రక్షించుకుంటూ ఎదుటి వారిపై పిడకలు విసురుకుంటూ గుంపులు, గుంపులుగా కదిలారు. ఒక సారి ఒక వర్గం వారిది పైచేయి అయితే, మరో సారి మరో వర్గం వారిది పైచేయిగా నిలిచింది. దెబ్బలు తగిలిన వారు స్వామి వారి బండారు అంటించుకున్నారు. ఈ సమరాన్ని జనం ఆసక్తిగా చూశారు. కేకలు, ఈలలతో హోరెత్తించారు. పోరు ముగిసిన తర్వాత గ్రామ పెద్దలు ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవిలకు వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– ఆస్పరి



కైరుప్పలలో పిడకల సమరాన్ని తిలకిస్తున్న ప్రజలు (ఇన్‌సెట్) అలంకరణలో స్వామి, అమ్మవారు

మట్టి మనుషుల గట్టి సంబరం

ఉగాది ఉత్సవాల్లో భాగంగా బుధవారం కల్లూరు చౌడేశ్వరీ దేవాలయంలో బురదలో రైతులు ఎద్దులతో, రజకులు గార్ధబా(గాడిద)లతో ప్రదక్షిణలు చేశారు. ఎద్దులను, గార్ధబాలను యజమానులను రంగు రంగులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అంగళ్లు కొనుగోలుదారులతో కళకళలాడాయి. ఆలయం చుట్టూ ఉన్న బురదలో యువత కేరింతలతో సంబరాలు చేసుకున్నారు. ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకలు చేసుకున్నారు. గాడిదలు, ఎద్దులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి రైతులు, రజకులు తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.

ఘనంగా జ్యోతులు ఉత్సవాలు

చౌడేశ్వరీ దేవి జ్యోతుల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున జ్యోతులతో భక్తులు కల్లూరు పుర వీధుల్లో తిరిగి ఆలయానికి చేరారు. అనంతరం మొక్కులు ఉన్నవారందరూ జ్యోతులను వెలిగించి భక్తి చాటుకున్నారు.

– కల్లూరు



బురదలో గార్ధబాలతో ప్రదక్షిణ చేస్తున్న రజకులు



చౌడేశ్వరి ఆలయం చుట్టూ ఎద్దులతో ప్రదక్షిణ చేస్తున్న రైతులు

ఇంటి వద్ద నుంచే ఓటు వేయొచ్చు

- వృద్ధులు, దివ్యాంగులకు ఈసీ అవకాశం

నంద్యాల(అర్బన్): 85ఏళ్లు పైబడిన వారు, 40శాతానికి పైగా అంగవైకల్యం ఉన్న వారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నంద్యాల జిల్లా సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో తొలిసారిగా వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును భారత ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందన్నారు. పోలింగ్ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారని, నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు ఇందు కోసం ఫారం–12డి నింపి రిటర్నింగ్ అధికారికి గానీ, సహాయ రిటర్నింగ్ అధికారికి పంపించాలని సూచించారు. దరఖాస్తు చేసుకొనే వారు తమ పూర్తి చిరునామా సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలన్నారు. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, దరఖాస్తులను అందుకున్న తర్వాత సంబంధిత దరఖాస్తుదారుల ఇళ్లకు బూత్‌స్థాయి అధికారులు వెళ్లి విచారించి అర్హతను నిర్ణయిస్తారన్నారు. పోలింగ్ కేంద్రంలో ఉండే రహస్య ఓటింగ్ పద్ధతి ఇంటి నుంచే ఓటు వేసేటప్పుడు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకుందాం

- నగరంలో అవగాహన ర్యాలీ



ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు డాక్టర్ పెంచలయ్య

కర్నూలు (టౌన్): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ పెంచలయ్య అన్నారు. బుధవారం స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా నగరంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్ పర్సన్లు ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతబస్తీలోని గఫార్ స్ట్రీట్, ఐడీఎల్ స్కూల్ మీదుగా రంగరాజు వీధి, వన్‌టౌన్ సర్కిల్, జొహరాపురం రోడ్డు, బేకార్ కట్ట, మోతియా స్కూల్, రాముల వారి గుడి, దండిగేరి మైదానం, బుధవారపేట బ్రిడ్జి మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు.

సంక్షేమ బావుటా



వెలుగులు నింపిన దేవుడు జగన్



నాకు ఆరుగురు ఆడపిల్లలు. ఎకరా పొలం ఉంది. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేసిన తర్వాత భర్త దూరంగా ఉంటున్నాడు. గుత్తి ఆర్‌ఎస్‌లో ఓ హోటల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేదాన్ని. కష్టపడి నలుగురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశా. పెద్ద కూతురు రంగమ్మ కుటుంబ కలహాలతో 2012లో ఆత్మహత్య చేసుకుంది. ఆమె కూతురు మీనాక్షిని నేనే జొన్నగిరి జెడ్పీస్కూల్‌లో 9వ తరగతి చదివిస్తున్నా. కరోనా సమయంలో చేసేందుకు పనిలేదు. కుటుంబ గడవడం కోసం మూడో కూతురు సోమ్లీబాయితో కలిసి పక్కగ్రామమైన జీ.ఎర్రగుడిలో హోటల్ పెట్టుకున్నాం. పిల్లల పోషణ కోసం ఎన్నో కష్టాలు పడ్డా. ఇలాంటి సమయంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే నాకు ఒంటరి మహిళ కింద పింఛన్ మంజూరైంది. వైఎస్సార్ ఆసరా కింద ఏటా .రూ.7,500 చొప్పున నాలుగు విడతల్లో రూ.30వేలు వచ్చింది. వైఎస్సార్ చేయూత కింద మూడు విడతల్లో రూ.56,250 అందింది. మనవరాలు మీనాక్షికి అమ్మఒడి కింద మూడేళ్ల పాటు రూ.42వేలు వచ్చింది. ఆ పిల్ల భవిష్యత్తు కోసం ఆ సొమ్మును దాచిపెట్టా. ఇలాంటి సమయంలో మూడో కూతురు సోమ్లీబాయి భర్త ఏడాది కింద రైలు కిందపడి చనిపోయాడు. ఆమెకు పింఛన్ మంజూరైంది. ఆమె కొడుకు హర్ష నాయక్‌కు కూడా రెండేళ్లుగా అమ్మఒడి డబ్బులు వస్తున్నాయి. జగన్ పథకాలు లేకుంటే కష్టాల్లో ఉన్న మేం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం. ఆ పథకాలు మాకు ఎంతగానో ఆసరా అయ్యాయి. టీడీపీ హయాంలో మాకు ఎలాంటి లబ్ధి లేదు. జగన్ వచ్చాకే పథకాలు అందుతున్నాయి. మా జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు జగనన్న. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– పడిత్యా నాగమ్మ, చెర్వుతండా, తుగ్గలి మండలం

ప్రతి మండలంలో రోజుకు 5వేల మందికి 'ఉపాధి'

కర్నూలు(సెంట్రల్): ప్రతి మండలంలో రోజుకు 5 వేల మందికి తగ్గకుండా ఉపాధి హామీ పనులను కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె క్యాంపు కార్యాలయం నుంచి ఉపాధి హామీ పనులపై మండల స్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ సగటు వేతనం రూ.300 ఉండగా కర్నూలు జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో సరాసరి రూ.281 వరకు వస్తుందన్నారు. హొళగుంద మండలంలో రూ.232 మాత్రమే ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనలో పత్తికొండ మండలం కూడా వెనుకబడి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పనుల కల్పనలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉదయం 6 నుంచి 10.30 గంటల వరకే పనులు చేయించాలని, అవసరమైతే మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల దరఖాస్తులను త్వరగా పరిష్కరించండి

ఎన్నికలకు సంబంధించి వచ్చిన ఫారం–6, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. దరఖాస్తుల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లోని అన్ని కేడర్ల ఉద్యోగులు ఈనెల 13లోపు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్ విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన వైద్యశాలకు మధ్యప్రదేశ్‌కు చెందిన సునీల్‌కుమార్ భరద్వాజ్ అనే భక్తుడు ట్రాన్స్‌పోర్టు వెంటిలేటర్ విరాళంగా ఇచ్చారు. బుధవారం వెంటిలేటర్ శ్రీశైల దేవస్థానానికి చేరింది. మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తుల ఆరోగ్య అవసరాల కోసం శ్రీశైల దేవస్థానం వైద్యశాలను నిర్వహిస్తుంది. ఇటీవల మల్లన్న దర్శనానికి వచ్చిన సునీల్‌కుమార్ భరద్వాజ్ దేవస్థాన వసతి విభాగ సహాయ కార్యనిర్వహణాధికారి మోహన్‌ను కలిశారు. ఆయన దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్ విరాళంగా అందిచాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే స్పందించిన సునీల్‌కుమార్ శ్రీశైల దేవస్థానం పేరుతో సుమారు రూ.5లక్షల విలువ చేసే వెంటిలేటర్‌ను బుక్ చేశారు. ఈ వెంటిలేటర్ హాస్పిటల్, అంబులెన్స్‌లో కూడా వినియోగించవచ్చు.

అక్రమ మద్యం నిల్వలపై సెబ్ దాడులు

- 187 మద్యం బాటిళ్లు స్వాధీనం
- నలుగురిపై కేసు నమోదు



అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అక్రమ మద్యం నిల్వలు, రవాణాపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. కర్నూలు సెబ్ స్టేషన్, డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్, పంచలింగాల చెక్‌పోస్టు అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించి 187 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దూపాడు గ్రామానికి చెందిన కుమ్మరి ఈశ్వరమ్మ దగ్గర 140, కర్నూలు బంగారుపేటకు చెందిన వరాలు దగ్గర 26, సల్కాపురం గ్రామానికి చెందిన ఫాతిమా బీ నుంచి 12, కర్నూలుకు చెందిన సందీప్ నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నర్సనాయుడు, సెబ్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై చర్యలకు వినతి

ఆదోని అర్బన్: పార్టీ పేరును, జాతీయ నాయకుడు లక్ష్మన్న, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పేరును రచ్చకీడ్చిన ఫోన్ సంభాషణ విషయంలో బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఆదోని పట్టణ మాజీ అధ్యక్షుడు కునిగిరి నాగరాజుపై చర్యలు తీసుకోవాలని బుధవారం డీఎస్పీ శివనారాయణస్వామికి పెద్దకడబూరు మండల బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం పెద్దకడబూరు మండల బీజేపీ అధ్యక్షురాలు మేరమ్మ విలేకరులతో మాట్లాడారు. బీజేపీలో చాలా సంవత్సరాలుగా పని చేస్తున్నానని, పొత్తులో భాగంగా ఆదోనికి బీజేపీ సీటు కేటాయించడం జరిగిందన్నారు. పట్టణానికి చెందిన కునిగిరి నాగరాజు, నీలకంఠ ఆదోనికి కేటాయించిన బీజేపీ సీటును టీడీపీ నాయకులకు రూ.3 కోట్లకు అమ్మేందుకు ఫోన్‌లో సంప్రదింపులు జరిపారన్నారు. ఈ సంభాషణలో జాతీయ, రాష్ట్ర నాయకులు లక్ష్మన్న, పురందీశ్వరి పేర్లను ప్రస్తావించడం వల్ల మీడియాలో విస్తృత ప్రచారం జరిగిందన్నారు. దీంతో తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమను చిన్నచూపు చూస్తున్నారని, అందువల్ల ఈ విషయంలో వారిద్దరి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



కన్నడ భక్తులతో మహానంది క్షేత్రం కిటకిటలాడింది. తమ ఇంటి ఆడపడుచుగా భావించే శ్రీశైల భ్రమరాంబను దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు తిరుగు ప్రయాణంలో మహానందీశ్వరుడి దర్శనానికి తరలివస్తున్నారు. క్షేత్రంలో ఎటు చూసినా భక్తులే కనిపించారు. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

– మహానంది

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం



ఈవీఎం, వీవీప్యాడ్‌ల గురించి వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓల పాత్ర కీలకమని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. బుధవారం అశోక్‌నగర్‌లోని తనీష్ కన్వెన్షన్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంల నిర్వహణపై అవగాహన కల్పించారు. పూర్తి బాధ్యతాయుంగా పని చేయాలని సూచించారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ



వృద్ధులకు పండ్లు, బ్రెడ్డును అందజేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు నాయకుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని సీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బీక్యాంపులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అంతకుముందు సీఆర్ భవన్‌లో రాజేశ్వరరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి, నాయకులు మహేష్, శివ ప్రసాదు, సురేంద్ర, రంగన్న, విజయ, నాగేశ్వరమ్మ, మధు పాల్గొన్నారు.

13న సీతారాముల కల్యాణం



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: ఈనెల 13న మున్సిపల్ ఎగ్జిబిషన్ హైస్కూల్ గౌండ్‌లో సీతారాముల కల్యాణం ఉంటుందని ఉత్సవ సమితి అధ్యక్షులు కె.క్రిష్టన్న తెలిపారు. బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 6 గంటలకు గోశాలలో తలంబ్రాల సేవ, శుక్రవారం స్వామి వార్లకు తిరుమంజన సేవ ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం సీతారాముల కల్యాణం ఉంటుందన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు ఎస్వీ నారాయణరెడ్డి, మహాబలేష్, కార్యదర్శి ఎమ్.నాగోజీరావు, కోశాధికారి కల్కిమురళి, సంయుక్త కార్యదర్శులు ఎస్.నటేష్‌కుమార్, గోపీనాథరావు, మల్లికార్జున, నరసింహారావు, వీహెచ్‌పీ నగర అధ్యక్షులు టి.సి. మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రజా సేవ చేసే నాయకులను గెలిపించాలి

కర్నూలు(సెంట్రల్): వచ్చే ఎన్నికల్లో ప్రజా సేవ చేసే నాయకులను గెలిపించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు షేక్ మహ్మద్ షరీఫ్ ప్రజలను కోరారు. బుధవారం సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజగోపాల్, ఎస్‌డీ ఖాజాపాషా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

శ్రీరాముడు సర్వమానవాళికి ఆదర్శం



ప్రవచనం చెబుతున్న ధార్మిక ఉపన్యాసకులు కర్నాటి చంద్రమౌళిని

కర్నూలు కల్చరల్: మానవుడు సమాజంలో ఎలా నడుచుకోవాలో తాను ఆచరించి చూపిన ఆదర్శ మూర్తి కాబట్టే శ్రీరాముడు సర్వమానవాళికి ఆరాధ్య దైవం అయ్యాడని తెలుగు పండితులు, ధార్మిక ఉపన్యాసకులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శ్రీరామనవమి విశిష్టతపై ఉపన్యసించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నగరూరి దీప్తి, అర్చకులు గిరిశర్మ, కృష్ణ కాంత్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

నేడు మునగాలలో కబడ్డీ పోటీలు

గూడూరు రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని గూడూరు మండల పరిధిలోని మునగాలలో గురువారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 8,116, రెండో బహుమతి రూ. 6,116, మూడో బహుమతి రూ. 4,116, నాలుగో బహుమతి రూ. 2,116 అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మకు అభయం

- గర్భం దాల్చినప్పటి నుంచే ప్రభుత్వ పర్యవేక్షణ
- ప్రసవించే వరకు క్రమం తప్పకుండా వైద్యసేవలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా 50 వేల ప్రసవాలు
- వంద శాతం ఆసుపత్రుల్లోనే కాన్పులు
- నేడు జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం

బిడ్డను కంటూ ఏ తల్లీ, జన్మిస్తూ ఏ బిడ్డా మరణించకూడదన్నది రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశం. అందుకనుగుణంగా మహిళలకు గర్భం దాల్చిన ప్పటి నుంచే ఆరోగ్య సూచనలు అందిస్తూ, ప్రసవించిన తర్వాత తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తోంది. మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ జయంతిని పురస్కరించుకుని 2003 నుంచి ఏటా ఏప్రిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఆదోనిలోని ఏరియా ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి, కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నింటిలోనూ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. గర్భిణి తన ఇష్టమైన ఆసుపత్రిలో చేరి సుఖప్రసవం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటోంది. గర్భం దాల్చిన ప్రతి మహిళ పేరును వైద్య సిబ్బంది యాప్‌లో పేరు నమోదు చేయించి, ప్రసవం అయ్యేంతవరకు పర్యవేక్షిస్తున్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి మాతృమరణాలను అరికడుతున్నారు.

మాతృత్వ పథకాలు

జననీ సురక్ష యోజన: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల గర్భిణులు ఆసుపత్రిలో ప్రసవిస్తే ఆమె బ్యాంకు ఖాతాకు నగదును జమ చేస్తారు.

ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్: ప్రతి నెలా 9న సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. గర్భధారణ వ్యవధిలో 3 నుంచి



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మాతాశిశు కేంద్రం

ఆరు నెలల వరకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తారు.

సుమన్: మాతాశిశు మరణాలను తగ్గించేందుకు సురక్షిత్ మాతృత్వ ఆశ్వాసన్(సుమన్) పథకాన్ని 2019 అక్టోబర్‌లో ప్రారంభించారు. పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు ప్రసవం తర్వాత ఆరు నెలల వరకు తల్లీబిడ్డకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ఉచితంగా చికిత్స అందిస్తారు. ఇంటి నుంచి వైద్యశాలకు ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తారు.

ప్రధానమంత్రి మాతృవందన యోజన: మూడు విడతల్లో గర్భిణికి ఆర్థిక సాయం అందజేస్తారు. గర్భిణిగా పేరు నమోదు చేసుకున్న తర్వాత తొలివిడగా రూ.1,000, రెండో విడతగా ఆరు నెలల తర్వాత ఆరోగ్య పరీక్షల నిమిత్తం మరో రూ.2వేలు, ప్రసవం అనంతరం శిశువు, తల్లి ఆరోగ్య రక్షణకు చివరి విడతగా రూ.2 వేలు అందజేస్తారు.

మాతృమరణాలు తగ్గుముఖం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత నాలుగేళ్లలో మాతృమరణాలు తగ్గుముఖం పట్టాయి. 2019-20లో 63,453 మంది ప్రసవించగా 40, 2020-21లో 62,817 మంది ప్రసవించగా 28 మంది, 2021-22లో 46,586 మంది ప్రసవించగా 30 మంది, 2022-23లో 51,142 మంది ప్రసవించగా 13 మంది, 2023-24లో కేవలం కర్నూలు జిల్లాలో మాత్రమే 28,970 మంది ప్రసవించగా 10 మంది మాత్రమే మృతిచెందారు.

పెరిగిన ఆసుపత్రి ప్రసవాలు

ప్రతి గర్భిణీ ఆసుపత్రిలోనే పురుడు పోసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా 2019-20లో 63,143(99.49శాతం), 2020-21లో 62,800(99.47శాతం), 2021-22లో 46,701(99.90శాతం), 2022-23లో 51,402, 2023-24లో కేవలం కర్నూలు జిల్లాలో 28,108 ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరిగాయి.

రక్తహీనత నివారణకు చర్యలు

రక్తహీనత నివారణకు గర్భం దాల్చిన వెంటనే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నారు. తీవ్ర రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఎక్కిస్తున్నారు. 7 శాతం లోపు ఉంటే వారికి రక్తం ఎక్కించి ప్రసవ సమయంలో ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. 2019-20లో 75,059(95.67శాతం) మందికి, 2020-21లో 84,372(100.44శాతం) మందికి, 2021-22లో 47,994(103.71శాతం) మందికి, 2022-23లో 50,270(96.5శాతం) మందికి, 2023-24లో కేవలం కర్నూలు జిల్లాలో 31,208(98శాతం) మందికి ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేశారు.

మాతృమరణాలు అరికడతాం



హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించి మాతృమరణాలను అరికడతాం. వైద్యాధికారి నుంచి ఏఎన్ఎం వరకు గర్భిణిని పర్యవేక్షించి వారం ముందుగానే ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మాతృమరణాలపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించుకుని పొరపాట్లు పునరావృతం గాకుండా చర్యలు తీసుకుంటున్నాం. మాతృమరణాలకు కారకులైన వారిపై చర్యలు కూడా తీసుకుంటున్నాం.

– డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

మైనారిటీ కార్యాలయం ప్రారంభం

కర్నూలు(అర్బన్): జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆధునీకరించిన మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఆధునీకరించుకొని ప్రారంభించకోవడం జరిగిందన్నారు. ముందుగా మౌలానాలు, పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. ఆధునీకరణలో భాగంగా కార్యాలయంలో అధికారికి ప్రతేక్యంగా చాంబర్, విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రత్యేకంగా క్యాబిన్లు, పెయింటింగ్, తాగునీరు, కార్యాలయం ముందు భాగంలో కార్యాలయాల పేర్లతో బోర్డు, స్టోర్ రూమ్, విద్యుత్ తదితరాలను ఆధునీకరించి కార్యాలయాన్ని అందంగా మార్చారు. కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్‌రావు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కన్నా, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సబీహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



మైనారిటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

ప్రభుత్వ అతిథి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికల అబ్జర్వర్లు రానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహాన్ని కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం పరిశీలించారు. గదులు, కిచెన్, మీటింగ్ హాళ్లలో కల్పించాల్సిన మౌలిక వసతులపై అధికారులతో చర్చించారు. మీటింగ్ హాలులో 5 కంప్యూటర్లు, ఇంటర్నెట్, ప్రింటర్, స్కానర్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని, కొత్త ఫ్లోర్ కార్పెట్‌ను ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. సూట్ రూమ్‌లో టీవీ, ఇంటర్నెట్ సదుపాయం, కిచెన్‌లో ఫ్రిడ్జ్, 8 సీటర్ డైనింగ్ టేబుల్, డైనింగ్ హాలులో ఏసీ ఏర్పాటు చేయాలలని, ట్యాప్‌లను మార్చాలని ఆదేశించారు. ఆమె వెంట నగర పాలకసంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ కోరారు. బుధవారం రాత్రి హౌసింగ్ బోర్డు కాలనీలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్‌పై రెండు ఓట్లు వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా ఇంతియాజ్‌లను గెలిపించాలని కోరారు.

- రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ ముస్లింలకు సూచించారు. ముస్లిం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఆమె రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.
- బుధవారం రాత్రి నరసింగరావు పేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌ను ఆ పార్టీ లీగల్ సెల్ నాయకులు కలిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు సువర్ణారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షాషావలి, రాజేష్ పాల్గొన్నారు.



ఓటు వేయాలని కోరుతున్న సిట్రా సత్యనారాయణమ్మ

మార్గదర్శకాలు పాటించాలి

- పాణ్యం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న పాణ్యం ఆర్వో/జేసీ మౌర్య

కల్లూరు: ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక గుత్తి రోడ్డులోని కేవీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గ ఎన్నికల పీఓ, ఏపీఓలకు విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ.. పోలింగ్ రోజున ఈవీఎంలను కనెక్ట్ చేసుకోవడం, తొలగించడం, మాక్ పోల్ నిర్వహణ, మాక్ పోల్ స్లిప్స్ నిర్వహణ, మాక్ పోల్ క్లియర్, పోలింగ్ యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ మిషన్లు, వీవీ ప్యాట్ స్లిప్స్ స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాల తహసీల్దార్లు, పీఓలు, ఏపీఓలు, సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి



ఓఆర్ఎస్ ద్రావణం గురించి వివరిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన నగరంలోని శరీన్‌నగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బకు గురైన వారు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని, శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోయి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా తిరగరాదని చెప్పారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణిలు, పాలిచ్చే తల్లులు, వేడిమి ఉన్నచోట ఎక్కువ శ్రమతో పనిచేసేవారికి, వ్యాధులతో బాధపడేవారికి వడదెబ్బ తాకేందుకు అధిక అవకాశం ఉందన్నారు. ఈ మేరకు అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబస్సుం, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఒంటెత్తు పోకడతో టీడీపీకే నష్టం

- ఎన్‌డీఏ పక్షాల సమావేశంలో బీజేపీ, జనసేన నాయకులు

కర్నూలు: ఎన్నికల ప్రచారానికి కూటమి నాయకులను పిలువకుండా టీడీపీ అభ్యర్థులు ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తున్నారని, ఇలాగైతే వారికే నష్టమని బీజేపీ, జనసేన నాయకులు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు బీటీ నాయుడు అధ్యక్షతన బుధవారం ఎన్‌డీఏ (బీజేపీ, టీడీపీ, జనసేన) మిత్రపక్షాల సమావేశం జరిగింది. మూడు పార్టీల జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన సమావేశంలో ఎన్నికల బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థుల వ్యవహారశైలిపై బీజేపీ, జనసేన నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రచారాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఒంటెత్తు పోకడతో వెళ్తున్నారని జిల్లా అధ్యక్షుని దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా పొత్తు ధర్మం పాటించాలని బీజేపీ, జనసేన నాయకులు హితవు పలికారు. ఇకపై కూటమి అభ్యర్థులను సమన్వయం చేసుకుని ప్రచారానికి వెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో బీజేపీ నాయకులు నీలకంఠ, రామస్వామి, కపిలేశ్వరయ్య, సూర్యప్రకాష్, కోటేశ్వరరెడ్డి, ప్రేమ్‌కుమార్, మురహరి రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, శ్రీరాములు, వెంకటరాముడు, ఆదోని బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధి, జనసేన నాయకులు సురేష్ బాబు, మల్లప్ప, వెంకటప్ప, రేఖ, రాజశేఖర్, హర్షద్, లక్ష్మన్న, రాంబాబుతో పాటు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, శాసనసభ నియోజకవర్గాల అభ్యర్థులు వీరభద్రగౌడ్, రాఘవేంద్రారెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, టీజీ భరత్, బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పేదల పక్షం

- టీజీ కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదు
- వారి మాటలు నమ్మొద్దు
- కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఇంతియాజ్

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ పేదల పక్షమని కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఇంతియాజ్ అన్నారు. బుధవారం ఆరోరానగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి, వార్డు ఇన్‌చార్జ్ భారతితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీవై రామయ్య, ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ టీజీ ఫ్యామిలీ రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా కర్నూలుకు ప్రాతినిధ్యం వహించి ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు ఇంట్లో కూర్చొని ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా ఇంతియాజ్‌ను గెలిపించాలని ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో వైఎస్సాఆర్‌సీపీ నాయకులు రమణ, రాజశేఖర్, చెన్నమ్మ, జమీల సుచరిత, నాగవేణీ రెడ్డి పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీలో చేరిక

స్థానికులు రమణ, డిష్ రాధాక్రిష్ణతో పాటు పలువురు పార్టీలో చేరారు. వారికి కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.



ఆరోరానగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీవై రామయ్య, ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడి, విజయమనోహరి

ఇఫ్తారు విందు..

నగర శివారులోని జగన్నాథ గట్టు వద్ద ఉన్న మసీదులో బుధవారం రాత్రి ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన నాయకులు మొయిజ్‌ఖాన్, కార్పొరేటర్లు, నాయకులు మత పెద్దలతో కలిసి దువా చేశారు.



ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



పార్టీలో చేరిన వారితో బీవై రామయ్య, ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరి